

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులకు 12వ పీఆర్సీ అమలు చేయాలని, బకాయి డిఎలను తక్షణమే ఇవ్వాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు గత సమ్మె హామీలతో పాటు సమ్మె కాలపు వేతనం ఇవ్వాలని, మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తక్షణమే ఉద్యోగాన్ని కల్పించాలని, అదనంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. నేడు ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న నిరసనలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తీరని 'హార్మోన్' కష్టాలు..!

- పని చేయించుకుని బిల్లులివ్వని వైనం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



హార్మోన్ సిటీలో నిర్మాణాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హార్మోన్ సిటీలో స్థలం కొనుగోలు చేసిన వారు ఎప్పుడు మౌలిక సదుపాయాలు కల్పిస్తారా అంటూ ఎదురు చూశారు. ఇప్పుడేమో అక్కడ పనిచేసిన వారు బిల్లులు మంజూరు చేయండి మహాప్రభో అంటూ బయటకొచ్చి ఆవేదన వెల్లబుచ్చారు. తమకు న్యాయం చేయించాలని పోలీసులను ఆశ్రయించి గోడు వెల్లబోసుకున్నారు. అనంతపురం నగరానికి సమీపంలో ఏర్పాటు చేస్తున్న హార్మోన్ సిటీ నిర్మాణ పనులు చేపట్టాలని కొంత మందికి కాంట్రాక్టు ఇచ్చారు. అయినా పనులు చేసినా దానికి బిల్లులివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సోమవారం నాడు జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై బుధవారం నాడు అనంతపురం రూరల్ పోలీసులకూ ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు.

రూ.87 లక్షలు ఇవ్వాలి

హార్మోన్ సిటిలో విల్లాల నిర్మాణ పనులను చేపట్టే బాధ్యతను గుంటూరుకు చెందిన విశ్వేశ్వరయ్య కన్‌స్ట్రక్షన్‌కు అప్పగించారు. వారు కొంత పని చేశాక డబ్బులు ఇవ్వలేదు. దీంతో పనులను ఆ సంస్థ ఆపేసింది. బిల్లులు చెల్లిస్తే తక్కిన పనిచేస్తామని చెప్పడంతో సంస్థ ఇవ్వకుండా జాప్యం చేసింది. బిల్లులు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది మార్చిలో సంస్థ ప్రతినిధి రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో డబ్బులు చెల్లిస్తానని హార్మోన్ సిటీ ప్రతినిధి రవికుమార్ చెప్పారు. హామీ ఇచ్చినా ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో రామారావు ఈ సోమవారం నాడు అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయం గ్రీవెన్స్‌లో దీనిపై మరోసారి ఫిర్యాదు చేశారు. ఈయనతో పాటు స్థానికంగానున్న మరో బిల్డర్ కూడా హార్మోన్ సిటీలో ట్యాంకుల నిర్మాణ పనులు చేపట్టి బిల్లులు ఇవ్వకపోవడంతో ఆయన కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంత పెద్ద వారే అయినా తప్పని ఎదురు చూపు

కార్బన్ హార్మోన్ సిటి ఏర్పాటు సమయంలో పెద్దపెద్ద ఐటి పరిశ్రమలు వస్తాయంటూ ప్రజాప్రతినిధుల చేత మీడియా సమావేశాలు ఏర్పాటు చేయించి ప్రకటనలు చేయించారు. పెద్దఎత్తున డబ్బున్న వాళ్లందరూ ఇక్కడ స్థలాలు, విల్లాలకు డబ్బులు కట్టారు. వైద్యులు, పోలీసు అధికారుల బంధువులు ఇలా అనేక మంది ఉన్నారు. కట్టిన తరువాత తీరా చూస్తే సంవత్సరాలు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగలేదు. కొన్ని నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. కొంత మంది ఆగిన నిర్మాణాలను నేరుగా కొనుగోలు చేసిన వారు అదనంగా ఖర్చు పెట్టుకుని కొనసాగించుకుంటున్నారు. మరికొంత మంది నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయోనని ఎదురు చూపులు చూసుకుంటూ కూర్చొన్నారు. డబ్బు కట్టిన వారి పరిస్థితి ఈ విధంగా ఉండగా, నిర్మాణాలు చేపట్టేందుకు వచ్చిన వారికి డబ్బులందక ఇబ్బందులు పడుతున్నారు. అటు నిర్మాణ పనులు.. ఇటు బిల్లుల చెల్లింపు ఎప్పటికి పూర్తవుతుందో అంటూ అందులో విల్లాలు కొన్న లబ్ధిదారులు, పనులు చేయించిన గుత్తేదారులు ఎదురు చూస్తున్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం

- ప్రభుత్వ విద్య, ఆర్థిక సమస్యలపై స్పందించాలి
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్
- శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగిన యుటిఎఫ్ రణభేరి



పెనుకొండ రణభేరిలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్,కదిరి టౌన్

ప్రభుత్వ విద్యారంగం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవకహరిస్తోందని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం, ఆర్థిక సంబంధిత సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి ప్రచార జాతా కార్యక్రమంలో బుధవారం శ్రీసత్యసాయి జిల్లాలో కొనసాగింది. పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల, కదిరి ప్రాంతాల్లో యాత్ర కొనసాగింది. పెనుకొండలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన రణభేరి కార్యక్రమాన్ని గేయానంద్‌తో పాటు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్‌లు రణభేరి డంఖాను మోగించి ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పట్టణ పురవీధుల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గేయానంద్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యారంగాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఇవి పరిష్కారానికి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇప్పటికీ ఒక్క డీఏ కూడా ఈ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. 12వ పిఆర్‌సిని నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులతో చేయిస్తున్న బోధనేతర పనులు అన్నింటి నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఎఫ్ఎ-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనాన్ని పాత పద్ధతిలనే చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై కూటమి ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25వ తేదీన గుంటూరులో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నిరసనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, ఉపాధ్యక్షులు జిహెచ్.బాబు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు ఈ.నారాయణ స్వామి, లక్ష్మీనారాయణ, జిసి.నరేష్ కుమార్, నరసింహప్ప, ఆర్.రామకృష్ణ నాయక్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతిష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కదిరిలో రణభేరి ప్రచారజాతాను నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బోధనేతర పనులు భారం వద్ద

కదిరి టౌన్ : విద్యార్థులకు పాఠాలు చెప్పే పనులు కాకుండా ఉపాధ్యాయులపై భోధనేతర భారాన్ని మోపడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ తెలిపారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి కార్యక్రమంలో బుధవారం సాయంత్రం కదిరికి చేరుకుంది. కదిరి పట్టణంలోని కోనేరు నుంచి రణభేరి జాతా ప్రారంభం అయ్యింది. హిందూపురం క్రాస్, టవర్ క్లాక్ సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఇందిరా సర్కిల్ మీదుగా బాలికల ఉన్నత పాఠశాల వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మి రాజా, శెట్టిపి జయచంద్ర రెడ్డిలు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగులో ఉన్న ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. 30 శాతం ఐఆర్‌ను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు చెన్నూరు తాహెర్ వలి, వైవి.సుబ్బారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున ఆజం బాషా, సంతోష్ కుమార్, నాయకులు మధుసూదన్, రాజేష్, రవివర్ధన్ రెడ్డి, నజీర్, రమణ నాయక్, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమరావతికి డీఎస్సీ ఉపాధ్యాయులు

45 బస్సులను ఏర్పాటు చేసిన అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



కలెక్టర్ ఓ.ఆనంద్

జిల్లాలో డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు గురువారం నాడు అమరావతికి వెళ్లనున్నారు. శుక్రవారం నాడు అక్కడ జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోనున్నారు. అభ్యర్థులను అమరావతికి తరలించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం సాయంత్రం డీఎస్సీ నియామకాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన అమరావతిలో మెగా డీఎస్సీ - 2025లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా నుంచి 45 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, విద్యా శాఖ అధికారులు మొత్తం 2,100 మంది వరకు అమరావతికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని పీవీకేకే కళాశాల నుంచి గురువారం ఉదయం అమరావతికి బస్సులు బయల్దేరుతాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలియజేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని

నీరుగార్చే చర్యలు మానుకోండి

25న విజయవాడలో ధర్నా - కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎమ్మెల్యేల జోక్యం పేరుతో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చేలా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు స్వస్తి పలకాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లపప డిమాండ్ చేశారు. ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను అనంతపురం గణేనాయక్ భవన్ కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ దళిత, గిరిజనులపై దాడి జరిగితే బాధితులు పోలీసు అధికారికి మౌకికంగా ఫిర్యాదు చేస్తే వెంటనే నమోదు చేసి, ఎఫ్ఐఆర్‌ను ఫిర్యాదుదారునికి ఇవ్వాల్సుందన్నారు. పోలీసుల అలసత్వంవల్ల ఎఫ్ఐఆర్ నమోదుకు కూడా జిల్లాలో పోరాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. చాలా కేసుల్లో ప్రజాప్రతినిధుల జోక్యం ఎక్కువై కేసులు నమోదు కాకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. కేసుల నిర్వీర్యానికి కౌంటర్ కేసుల పేరుతో దళితులపై కొత్త రకమైన మానసిక దాడికి యత్నం జరుగుతోందన్నారు. ఇలాంటి బెదిరింపులకు దిగుతున్న పోలీసు యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత 16 నెలలుగా జిల్లాలో దళితులపై దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు అధికం అయ్యాయన్నారు. ఇలాంటి సమయంలో దళిత, గిరిజనులకు రక్షణగా ఉన్న అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం విచారకరం అన్నారు. దళితులపై దాడుల చేసిన వారిపై కేసులు నమోదు చేయాలంటే ఎమ్మెల్యేల సిఫార్సులు ఉండాలనే కొత్త సంప్రదాయాన్ని తెర మీదకు తేవడం సరికాదన్నారు. రాజకీయ జోక్యం పెరగడంతో పాటు కొద్ది మంది పోలీసులు ప్రజా ప్రతినిధుల మెప్పుకోసం వెంపర్లాడుతూ దళితుల మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు నిర్వీర్యం చేయడం మానవ హక్కులకు ద్రోహం చేయడంమే అవుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేసుకునేందుకు పోరాటం చేయాల్సి ఉందన్నారు. దళితులపై జరిగిన దాడుల ఘటన కేసుల్లో చట్టాన్ని నిర్వీర్యం చేసే రాజకీయ జోక్యాన్ని ఆపాలన్నారు. స్టేషన్ బెయిల్ ఇచ్చే 41ఎ నోటీసుల విధానాన్ని ఆపాలన్నారు. కౌంటర్ కేసుల బెదిరింపులకు స్వస్తి పలకాలన్నారు. వీటన్నింటి కోసం ఈనెల 25న విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, నగర అధ్యక్షులు జీవరత్నం, జిల్లా నాయకులు నాగేంద్ర, అంజినేయులు, పుల్లన్న పాల్గొన్నారు.

తొలి వాస్తు శిల్పి విశ్వకర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


ప్రపంచ తొలి వాస్తు శిల్పి సష్టికర్త విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం అనంతపురం నగరంలో నిర్వహించారు. గుత్తి రోడ్డులోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకట శివుడు యాదవ్, వీర శైవ లింగాయత్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ స్వప్న , విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, డిఆర్ఓ మలోలా, ఆలయ ఛైర్మన్ మౌళి ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కుష్బు కొఠారి , బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ సుభాషిని, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎ.బాలకొండయ్య, అర్బన్ తహశీల్దార్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విరాట్ విశ్వకర్మకు నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్

కార్పొరేట్ సెలూన్స్ తొలగింపునకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి-గుంతకల్లు



సంతకాలు సేకరిస్తున్న క్షవర వృతిదారులు

పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్స్ దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట క్షవర వృత్తిదారుల సంఘం నేతల ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వీరికి సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, కాటికాపరి సంఘం రాష్ట్ర నాయకులు రమేష్, సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు స్వామిదాస్‌తోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ క్షవర వృత్తి సంఘం అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, నాయకులు బ్రహ్మ, శివశంకర్, రంగ, సురేంద్ర, బళ్లారి మధు, చరణ్, సాయి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా రాయితీ మోసపూరితం

రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా దాని వాడకాన్ని తగ్గించుకుంటే రూ.800 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం ప్రజలను వంచించడమే అవుతుందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో యూరియా వాడకం తగ్గిస్తే బస్తాకు రూ.800 రాయితీ ఇస్తామని చెప్పడం రైతులను మభ్యపెట్టడమే అన్నారు. కేంద్రం నుంచి రూ.500 కోట్లు తీసుకుని రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించుకోమని సుద్దులు చెప్పడం ఏమిటన్నారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరమైనన్ని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవాలన్న కక్కుర్తితో ఈ ఏడాది రాష్ట్రాలకు కేటాయింపు తగ్గించి, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకే రాయితీ ఇస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం దానికి మద్దతు ఇవ్వడం శోచనీయం అన్నారు. ప్రభుత్వ సంస్థల ద్వారా సరఫరా చేయాల్సిన ఎరువులు పెత్తందార్లు చేజిక్కించుకోవడంతో కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కుంటిసాకులు మాని రైతులందరికీ ఎరువులు, యూరియా సరిపడా అందజేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణ అవసరం

డాక్టర్లు ప్రసూన, నాగజ్యోతి, విశ్వనాథ్‌రెడ్డి, పల్లవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థినిలు చదువుతో పాటు తమ ఆరోగ్యం పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు ప్రసూన, డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, డాక్టర్ పల్లవి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బిఎన్ కళాశాల కాన్ఫర్స్ హాల్‌లో బుధవారం విద్యార్థినిలకు సెమినార్ నిర్వహించారు. మెంటల్ హెల్త్, ఫిజికల్, మెన్‌సెస్, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్ వినియోగంపై జాగ్రత్తలు, సూసైడ్ ప్రేరేపిత ఆలోచనలు వంటి అంశాలపై డాక్టర్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు పోటీ ప్రపంచంలో ఉన్నత ఆశయాలు సాధించేందుకు విద్యతోనే సాధ్యమన్నారు. విద్యాభ్యాసం చేసే క్రమంలో అనేక సమస్యలు ఎదురౌతుంటాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చెడు స్నేహాలు, చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలనే తలంతపుతో.. మీ జీవిత ఆశయాలను సాధించే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడి గురికాకుండా చూసుకోవాలన్నారు. రోజువారీగా చదువుతో పాటు ఆరోగ్య పరిక్షణకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, వంటివి పాటించాలన్నారు. సెల్‌ఫోన్‌లు, డిజిటల్ వేదికల వినియోగం మంచిని వినియోగించి చెడుకు దూరంగా ఉంచాలన్నారు. ఏ సమస్య వచ్చి తల్లిదండ్రులు, గురువులు, యాజమాన్యాలకు చెపి పరిష్కరించుకోవాలన్నారు. భయపడకుండా నిర్భయంగా ముందుకు సాగాలన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అశ్విని, చంద్రిక మాట్లాడుతూ ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 13, 14, 15 తేదీలలో అనంతపురంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో సాంస్కృతిక ఉత్సవాలు అక్టోబర్ 9, 10, 11 తేదీల్లో కృష్ణ కళామందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐద్వా మహిళ సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తూనే మహిళా చైతన్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ మాధవి, ఐద్వా జిల్లా నాయకురాలు గీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

సహజ వనరుల సంరక్షణతోనే సుస్థిర గ్రామాభివృద్ధి

డిపిఒ నాగరాజునాయుడు

ప్రజాశక్తి-అనంతపురం

సహజ వనరులను సంరక్షించుకుంటేనే సుస్థిత గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు సూచించారు. ఎఫ్ఇఎస్ సంస్థ అధికార ప్రతినిధి వలి అధ్యక్షతన బుధవారం నగరంలోని మాసినేని గ్రాండ్ హోటల్‌లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపిడిఒలకు పర్యావరణ పరిరక్షణ, జీవన ప్రమాణాలపై రెండు రోజుల చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వనరులను దీర్ఘకాలంలో సుస్థిరంగా రక్షించాలన్నారు. ఫౌండేషన్ ఫర్ ఎకాలాజికల్ సెక్యూరిటీ (ఎఫ్ఇఎస్) సంస్థ ప్రతినిధి భక్తర్‌వలి మాట్లాడుతూ ఎఫ్ఇఎస్ స్వచ్ఛంద, లాభాపేక్షలేని సంస్థగా కొనసాగుతోందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, డిప్యూటీ ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు, సంస్థ ప్రతినిధులు సదాశివ, స్నేహేష్, ధనశేఖరన్, తులసి, తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి
www.prajasakti.com

రక్తదానం ప్రాణదానంతో సమానం..

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు



రక్తదాన శిబిరంలో జెఎన్‌టియు విసి సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

రక్తదానం ప్రాణదానంతో సమానమని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. బుధవారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల డిస్పెన్సరీలో జాతీయ సేవ పథకం, ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి జిల్లా శాఖ సంయుక్తంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సుమారు 71 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ రక్తనిధి అభినందన పత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి దేవి, అడిషనల్ డిఎంహెచ్ఒ అనుపమ జేమ్స్, జిసిఐ విభాగం అధిపతి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారిణి జి.మమత, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వైస్‌ఛైర్మన్ లక్ష్మీప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సెక్రెటరీ మోహన్‌కృష్ణ, రక్తనిధి సిబ్బంది జీవన్‌కుమార్, మూర్తి, జాతీయ సేవ పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

అరటిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని మడుగుపల్లి గ్రామంలో అరటి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై హెచ్‌ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త సుబ్రమణ్యం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా అరటిలో వచ్చే దుంపకుళ్ళు తెగులుకు బ్లీచింగ్ పౌడర్ 25 గ్రాములకు ఒక లీటర్ నీటికి కలిపి మొక్క మొదళ్ళ వద్ద పోసి తడపాలన్నారు. దీంతోపాటు స్ట్రెప్టోసైక్లిన్ 0.3 గ్రాములతో తడపాలన్నారు. సెమటోడ్ వల్ల వేర్లపై మచ్చలు బొడిపెలు వస్తాయన్నారు. వీటికి లింగాకర్షక పంట బంతి వేసుకోవాలన్నారు. వీటితోపాటు పలు తెగుళ్లు, నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నార్పల హెచ్ఒ నెట్టికంటయ్య, హెచ్ఇఒ రామాంజనేయులు, విహెచ్ఎ కుమార్‌రాజ, రైతులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని వెన్నపూస పల్లి గ్రామంలో హెచ్‌ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అరటి పంటలో యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అరటికి వచ్చే తెగుళ్లు, నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నార్పల హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య, హెచ్ఇఒ రామాంజనేయులు, విహెచ్ఎ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన వారికి సన్మానం

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ బిఇడ్ కళాశాలలో చదివి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన వారిని బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విసి బి.అనిత మాట్లాడుతూ మీరు సాధించిన విజయం యూనివర్సిటీతోపాటు బిఇడ్ కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, కళాశాల ప్రధానాచార్యులు సోమశేఖర్, బిఇడ్ కళాశాల పర్యవేక్షకులు మల్లారి ఆలూరు లక్ష్మణరావు, ఉపాధ్యాయులు రాజేశ్వరి, శివనంద, భాస్కర్, నారాయణస్వామి, సుధాకర్, సోలమన్‌రాజ్, అనిత, సంజీవరాయుడు, కుంటల, బోధనేతర సిబ్బంది భరత్, ధర్మయ్య, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌కెయులో స్పోర్ట్స్ కార్యవర్గం సమీక్ష

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం స్పోర్ట్స్ కార్యవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి బి.అనిత స్పోర్ట్స్ సంబంధించిన ప్రణాళిక ప్రకారం, సూచనలు, సలహాలు ఇచ్చారు.

పలువురు టిడిపిలో చేరిక



టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

గుత్తి : మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జి.సూర్య ప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనాయాదవ్, శ్రీపురం సర్పంచి యు.రామలింగమయ్య ఆధ్వర్యంలో బుధవారం రజాపురం గ్రామానికి చెందిన పలువురు వైసిపి నాయకులు టిడిపిలోకి చేరారు. ఈ సందర్భంగా సర్పంచు విజయలక్ష్మి, వైసిపి నాయకుడు కేశవులుతోపాటు 30 కుటుంబాలకు చెందిన వారు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కర్నూలు జిల్లా ఆలూరులోని ఎమ్మెల్యే నివాసానికి వారందరూ వెళ్లి టిడిపిలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు చేస్తున్న రాష్ట్రాభివృద్ధి, పేదల కోసం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము పార్టీలోకి చేరామని నూతన నాయకులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు.

గుత్తిలో వైసిపి నాయకుల సంబరాలు

గుత్తి : వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుత్తికి చెందిన గంటా నరహరిని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడంతో గుత్తిలో బుధవారం వైసిపి నాయకుడు అశోక్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. స్థానిక గాంధీ కూడలిలో ఉన్న దివంగత నేత, మాజీ సీఎం వైఎస్‌ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. వైసిపి నాయకులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ కేకును కోసి పంచిపెట్టారు. గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు డిష్ అన్వర్, ప్రసాద్, శివ, మైను, హరి, కుళ్లాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమావేశం

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామ పంచాయతీలో ఉపసర్పంచు ఆలం వెంకట నరసనాయుడు అధ్యక్షతన బుధవారం సీజనల్ వ్యాధులపై గ్రామ ఆరోగ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య సిబ్బంది పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేపట్టి అనారోగ్యం ఉన్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేయడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, దోమతెరలు వాడడం, రోజుల తరబడి తొట్లలో నీటిని నిల్వ ఉంచకుండా వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని, పొడిచెత్త, తడి చెత్త వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : పిఎబిఆర్ డ్యామ్ తాగునీటి పథకం పైప్‌లైన్ లీకేజీని మరమ్మతు చేస్తున్నందున గురువారం సాయంకాలం నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ బాలస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సంస్థతో సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు సోదనపల్లి విద్యార్థిని



శింగనమల : రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు మండల పరిధిలోని సోదనపల్లి విద్యార్థిని మానస ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎం.సిరాజుద్దీన్, పీడీ బి.బయపరెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన రగ్బీ అండర్-14 పోటీల్లో మానస అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిని హెచ్ఎం, పీడీతోపాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

'సూపర్ హిట్ కాదు.. అట్టర్ ఫ్లాప్'

రాయదుర్గం : కూటమి ప్రభుత్వం ఇటీవల అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' సభ సూపర్‌హిట్ కాదని.. అట్టర్‌ఫ్లాప్ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌని ప్రతాపరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండానే సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయిందని ప్రశ్నించారు. వికలాంగుల పెన్షన్ల తొలగింపు, రైతులకు అవసరమైన యూరియా సరఫరా, గిట్టుబాటు ధర అమలు చేయకుండానే సూపర్ హిట్ ఎలా అవుతుందని నిలదీశారు. నెరవేర్చని హామీల గురించి ప్రశ్నిస్తే దాడి చేయడం, నిలదీయడం సమంజసమా అన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓటు చోరీ గది చోడ్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 'గ్లోబల్' విద్యార్థులు



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

అనంతపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్‌డిటి మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇండియన్ రౌండ్లో 9వ తరగతి చదువుతున్న జతిన్‌కుమార్ శివప్రసాద్, రికవర్ రౌండ్లో జూనియర్ కళాశాల విద్యార్థిని అన్వేషా ప్రియదర్శిని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, అకడమిక్ కోఆర్డినేటర్ అంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్చరీ కోచ్ శివకుమార్, పిఇటి హరీష్‌కు అభినందనలు తెలిపారు.

మహిళ బాగుంటేనే కుటుంబ ఆరోగ్యం

'స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభోత్సవంలో ఎంపి అంబికా



మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

మహిళ బాగుంటేనే కుటుంబ ఆరోగ్యం సాధ్యమని గ్రహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వస్తినారి స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన 'స్వస్తినారి స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని ఎంపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వతేదీ వరకూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో ముఖ్యంగా మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. డిఎంహెచ్ఒ ఇబి దేవి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, కమ్యూనిటీ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల్లో 15 రోజులపాటు మహిళలకు వైద్య పరీక్షలతోపాటు వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, జిల్లా ఆసుపత్రుల నిర్వహణ అధికారి డేవిడ్ సెల్వంరాజు, సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నరసింహులు, స్టేట్ నోడల్ అధికారి శ్రీనివాసులు, హేమంత్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి మల్లికార్జున, యుగంధర్, అనుపమ, విష్ణుమూర్తి, శ్రీనివాసరెడ్డి, గంగాధర్‌రెడ్డి, సుమన, డెమో త్యాగరాజు, నాగరాజు, గంగాధర్, ఆసుపత్రి ఆర్ఎంఒ రామకృష్ణ, డిప్యూటీ ఆర్ఎంఒ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

'ఇక్ స్టార్టప్' ఛాలెంజ్‌ను సద్వినియోగం చేసుకోండి

జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి సుదర్శన్‌రావు

ప్రజాశక్తి-అనంతపురం

ఇక్ స్టార్టప్ ఛాలెంజ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు సూచించారు. బుధవారం స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఇక్ స్టార్టప్ ఛాలెంజ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఒక ప్రతిష్టాత్మక సంస్థ అన్నారు. ఇది స్టార్టప్ కంపెనీలకు, ముఖ్యంగా ఐటీ, ఉత్పత్తి రంగాల వారికి మద్దతు ఇవ్వడం ద్వారా ఆవిష్కరణలకు ఊతమిస్తుందన్నారు. దేశానికి రతన్ టాటా ఇన్నోవేషన్ సేవలు కొనసాగించాలని జెఎన్‌టియులో ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల విభాగాధిపతులు, పాల్గొన్నారు.

ఉద్యోగాలకు జెఎన్‌టియు విద్యార్థుల ఎంపిక

గత జూలై, ఆగస్టు నెలల్లో అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో నలుగురు విద్యార్థులు రూ.6.25లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్, ప్లేస్‌మెంట్ ఆర్.కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర అభినంధించినట్లు ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలు పూర్తి చేయండి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



ఎమ్మెల్యేకు విశ్వకర్మ చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో ఆర్‌డిఒ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, విద్యుత్ ఇఇ రాజశేఖర్, ఎడి వెంకటసుబ్బయ్యతోపాటు పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడబోమన్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కసరత్తు చేయాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో అధికారులు నివేదికలకు అనుగుణంగా సంబంధిత మంత్రులతో చర్చించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేష్, మెడికల్ అధికారిణి ప్రసన్నభారతి, ఐసీడీఎస్ సీడీపీఓలు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీల సంతోషమే లక్ష్యం

మినీ అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మినీ అంగన్వాడీలను అప్‌గ్రేడ్ గ్రేడ్ చేయడంపై బుధవారం స్థానిక ప్రజావేదికలో అంగన్‌వాడీ యూనియన్, అండ్ వెల్ఫర్స్ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. తర్వాత కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మీదేవి, సిడిపిఒలు ప్రసన్నలక్ష్మి, పద్మావతి, సూపర్‌వైజర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

అనంతరం నియోజకవర్గంలో వివిధ రోగాలతో బాధపడుతూ ప్రయివేటు వైద్యశాలల్లో వైద్యం చేయించుకున్న పలువురు బాధితులకు మంజూరైన సిఎం సహాయనిధి కింద చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే స్థానిక కాళికాదేవి ఆలయంలో విశ్వబ్రహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

19న 'చలో మెడికల్ కాలేజీ'-వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటామని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో యువజన, విద్యార్థి విభాగం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించడంతోపాటు మన విద్యార్థులకు వైద్య, విద్య అవకాశాలు పెంచడమే లక్ష్యంగా జగన్ హయాంలో 17 కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీపీపీ పేరుతో మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేస్తోందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాన్ని వైసీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పరిశీలించనున్నట్లు చెప్పారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ఆపేంత వరకూ ఆందోళనలు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సమావేశంలో యువజన విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగర అధ్యక్షుడు శ్రీనివాస దత్త, నగర ఉపాధ్యక్షుడు ఉదయ్, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్యశ్రీ నిర్వీర్యానికి కుట్ర

అనంతపురం : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ పేరుతో కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందన్నారు. గత వైసిపి హయాంలో ఐదు మెడికల్ కళాశాలల నిర్మాణాలను పూర్తి చేసి తరగతులు ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. అలాంటి వాటిని ప్రయివేటుకు కట్టబెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు వీరన్న, నరేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం : స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం భాగంగా 'స్వచ్ఛ్ ఉత్సవ్' పోస్టర్లను బుధవారం రాయదుర్గం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు నజీర్, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ జగదీష్, సచివాలయం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలు సమస్యలపై ఎంపికి వినతి



ఎంపికి వినతిపత్రం అందజేస్తున్న రామాంజనయులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని దుర్గం గ్రామంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణకు పలు సమస్యలపై సర్పచు సాకే రామాంజనేయులు వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. తర్వాత అహోబిల లక్ష్మీనరసింహస్వామి ట్రస్టు సభ్యుల ఆహ్వానం మేరకు నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించారు. అలాగే గ్రామంలో ఫ్లోరైడ్ ఎక్కువ ఉండటంతో యూరోపియన్ పద్ధతిలో నీటిని శుద్ధి పరిచే పద్ధతిలో తాగునీరు అందించే విధానాన్ని అమలు చేయాలని ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే శివానంద ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎంపి తాగునీటి ట్యాంకు వద్దకు వెళ్లి పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, నాయకులు సాకే మురళీకృష్ణ, గూగూడు జాఫర్‌వలి, చిన్న మారెన్న, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో ముళ్లకంప తొలగింపు

బుక్కరాయసముద్రం : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ శ్మశానవాటికలో ముళ్లకంపలను తొలగించారు.

డెంగీ లక్షణాలతో చిన్నారి మృతి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో డెంగీ లక్షణాలతో బుధవారం ఓ చిన్నారి మృతి చెందాడు. ఆర్ఎస్‌లోని కర్నూలూ రోడ్డులో నివాసం ఉండే వెంకటరమణ, మౌనిక దంపతుల కుమారుడు హర్షిత్ (2)కు వారంరోజుల క్రితం జ్వరం రావడం స్థానిక ఆసుపత్రిలో వైద్య చికిత్స చేయించారు. రక్త పరీక్షలను డెంగీగా నిర్ధారణ కావడంతో చికిత్సల నిమిత్తం కర్నూలులోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న హర్షిత్ ఆరోగ్య పరిస్థితి విషమించి మరణించాడు. కుమారుడు మరణంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. చిన్నారి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా సందర్శించారు.

వివాహానికి 'దండు' ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దండు శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని తరిమెల గ్రామానికి చెందిన షేక్ షాజాది, షేక్ అక్బర్‌వలి కుమారుడు షేక్ అన్వర్ బాషా వివాహానికి శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు బుధవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వివాహాలకు ఆర్థికసాయం చేయడం ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ నిరుపేదలైన వివాహానికి తనవంతుగా ఆర్థికసాయం చేస్తూనే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

డ్వామా అడ్మినిస్ట్రేషన్ అధికారిగా రామకృష్ణ



అనంతపురం : గుమ్మగట్ట ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణ ఉద్యోగోన్నతిపై డ్వామా అడ్మినిస్ట్రేషన్ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈయన గుమ్మఘట్ట ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ డిఎల్‌డిఒగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో నీటి యాజమాన్య సంస్థ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన డ్వామా పీడీ సలీంబాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ అభినందనలు తెలిపారు.

క్రీడల్లో కొర్రపాడు పాఠశాల విద్యార్థుల ప్రతిభ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని కొర్రపాడు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగిన ఈత, రగ్బీ, మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో అత్యంత ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకులకు ఎంపికయ్యారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఎం.రేవంత్, డి.థామస్ ఈత పోటీల్లో, ధనుంజయ, వృష రగ్బీలో, ధనుష్, గౌతమ్ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ నారాయణ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్‌రెడ్డి, తిప్పేస్వామి తెలిపారు.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించండి

రాయదుర్గం : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రింగ్ ఆఫీసర్ ఎన్.రవిశంకర్‌రెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక రెవెన్యూ మీటింగ్ హాలులో పోలింగ్ బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 1200 మించకుండా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. 1200 కంటే అధికంగా ఓటర్లు ఉన్నచోట్ల హేతుబద్ధంగా పోలింగ్ కేంద్రాన్ని విభజించాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నాగరాజు, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్, సుజాతా దేవి, వీఆర్వోలు, బిఎల్వోలు, పోలింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున ప్రజాసంఘాల నాయకులు

కణేకల్లు : రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి)కి ఎఫ్‌ఆర్‌సిఎను పునరుద్ధరించి కాపాడాలని జడ్పిటిసి పద్మావతి కోరారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహిళా గ్రూప్ లీడర్లు, సిడిసి మెంబర్లు, ఉపాధ్యాయులు కలిసి బుధవారం అంబేద్కర్ విగ్రహం నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వరకూ సేవ్ ఆర్‌డిటి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినతిపత్రం స్థానిక జడ్పిటిసి పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది పేదలకు విద్య, వైద్యం అందిస్తున్న ఆర్‌డిటికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పుట్లూరులో 'పొలం పిలుస్తోంది'

పుట్లూరు : తాడిపత్రి ఎడిఎ రవి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎడిఎ వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు.

ఎరువుల దుకాణం తనిఖీ

మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఎడిఎ రవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరాలో ఎలాంటి తేడాలు లేకుండా రైతులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయని, వ్యవసాయ విస్తరణ అధికారి చిన్న నాగిరెడ్డి, విహెచ్ఎ రవితేజ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు విద్యార్థులు

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మల్లికార్జున తెలిపారు. ఈనెల 16వతేదీన జిల్లాలో నిర్వహించిన ఆటల పోటీల్లో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నరేష్, మణికంఠ, జగన్మోహన్‌రెడ్డి, అలివ్‌కుమార్, కార్తీక్, మధుకిరణ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈమేరకు ఆయా విద్యార్థులను ఎంఇఒలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని వినతి

గుత్తి : సమస్యల పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ హనుమాన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి గ్రామ రెవెన్యూ నాయకుల సంఘం మండల నాయకులు సుధాకర్, నారాయణస్వామి, జగదీష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కార సాధన కోసం ఈనెల 18, 19వతేదీల్లో తహశీల్దార్ కార్యాలయం వద్ద, 20న ఆర్డీవో కార్యాలయం, 22న జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు సుధాకర్, ప్రసాద్, యుగంధర్, ధను, మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎల్‌ఐసి ఏజెంట్ ఆత్మహత్య

గుత్తి : గుత్తి రైల్వేస్టేషన్‌లో బుధవారం ఓ ఎల్‌ఐసి ఏజెంట్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కురువగేరికి చెందిన అబ్బారెడ్డి(55) ఎల్‌ఐసి ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. అబ్బారెడ్డి కొన్నాళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు తీసుకున్న వ్యాధి నయంకాకపోగా బాధ భరించలేక తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాశాడు. మరణ వాఙ్మూలాన్ని తన భార్యకి తెలియజేయాలని సెల్ ఫోన్ నెంబర్ కూడా రాసి చొక్కాజేబులో పెట్టుకున్నాడు. గుత్తి రైల్వే స్టేషన్ వెళ్లి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన స్థలాన్ని జీఆర్పీ గుత్తి ఇన్‌ఛార్జి ఎస్ఐ మహేంద్ర, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పరిశీలించారు. అబ్బారెడ్డి రాసిన సూసైడ్ నోటును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.